



ప్రొద్దున పది గంటలకు పెనిమిటిని ఆఫీసుకు పంపితే మళ్ళీ సందెపనులు మొదలయ్యేదాకా ఏం చెయ్యాలో తోచక సతమతమౌతూ వుంటుంది సుశీల. మరీ నెలరోజులనుండి వాళ్ళ ప్రక్క వాటా ఖాళీ కావడంతో సుశీల సమస్య ఇంకా గడ్డు రూపం దాల్చింది. బాతాఖానీ వేయడానికి ఎవరూ దొరకడం లేదు. తమ ప్రక్క వాటాలో తప్ప చుట్టుప్రక్కల మిగతా ఇళ్ళల్లో ఉండేవాళ్లు ఉర్దూ, మరాఠీ, కన్నడం మాట్లాడేవాళ్లు. జంటనగరాల్లో కనీసం వాళ్ల ఇంటిచుట్టూ అయినా అచ్చగా తెలుగు మాట్లాడేవాళ్లు ఉంటే బాగుండు అని తోచినప్పుడల్లా అనుకుంటూ వుంటుంది సుశీల. లేదా, మన జానపద సినిమాల్లో మాదిరిగా వో మంత్రం ఉచ్చరించగానే తనకు ఉన్నపళంగా అన్నిభాషలూ మాట్లాడటం వస్తే బాగుండు అని కోరుకుంటుంది.

అయితే ఇవాళ ఉదయం ఇంటిఖామందు వచ్చి ప్రక్కవాటా పరిశుభ్రం చేయించాడు. ఇల్లు కడిగిన పనిమనిషిని అడిగి తెలుసుకొన్నది సుశీల, ప్రక్కవాటాలో ఇవాళ వో దంపతులు దిగుతున్నారని. 'తెలుగువాళ్ళేనా?' అని నోరారా అడిగింది. 'అవును' అని పనిమనిషి చెబితే సరే అని ఊరుకో వచ్చునా? ఊహూ! 'గుంటూరు జిల్లా వాళ్ళేనా?' అని రెండో ప్రశ్న వేసింది. మళ్ళీ అవును అని సమాధానం వచ్చే దాకా సంతృప్తి చెందలేదు సుశీల.

తెలుగువాళ్ళు; అందులోనూ తమ జిల్లా వాళ్ళు ప్రక్కవాటాలో దిగి దిగటంతోనే ఈమె వాళ్ళకు ఏదో త్రవ్వి తలకు ఎత్త బోతున్నట్టు,

వాళ్ళ అమ్మగారో, అన్నయ్యో వస్తున్నట్టుగా సంతోషం పట్టలేక తన పెనిమిటి రాజేశ్వరరావు ఆఫీసుకు వెళ్ళినప్పటి నుండీ వరండాలోనే కూర్చున్నది సుశీల.

సుశీలకు ఆట్టే విసుగు కలిగించకుండానే వచ్చింది ప్రక్కవాటాలోకి రావలసిన ఆవిడ.

నెమలి పింఛం రంగు ఫ్లవర్ డిజైన్ వేసిన ఫుల్‌వాయిల్ చీరె కట్టుకున్నది. చీరెకు మ్యాచింగ్‌గా కెంపురంగు టూ బై టూ జాకెట్ వేసుకున్నది. చెవులకు తెలుపు, నీలం, కెంపు, మూడు రంగుల పూసలు గ్రుచ్చిన లోలాకులు పెట్టుకున్నది. రెండు ఆకులు, ఒక మొగ్గతో కూడిన తెల్ల గులాబీ పువ్వును నల్లని జడలో ముడుచుకున్నది. నొక్కులు తిరిగిన ముంగురులు తెల్లని నొసటన నాట్యం చేస్తున్నాయి. నీలి రంగు చలువ అద్దాలు ఆమె నయనాలకు దిష్టి తగులుతుందేమో అన్నట్టుగా గంతలు కట్టినట్టు వున్నాయి. తన పెనిమిటి శేఖరంతో కలిసి వచ్చి వాకిటి ముందు నిలబడ్డది ప్రియంవద.

శేఖరం తాళం తీసి తలుపులు తెరుస్తూ వుంటే ప్రియంవద చలువ అద్దాలు తీసి చేత బుచ్చుకున్నది. శంఖు పువ్వుల్లాంటి కళ్ళల్లో గండు తుమ్మెదలలా నల్లగ్రుడ్లు మెరుస్తూ వుంటే ఆమె లోపలికి వెళ్ళింది.

వరండాలో కూర్చున్న సుశీల అలా చూస్తూ నిలబడ్డది. ఆ వచ్చిన ఆవిడ అందాన్ని, అలంకారాన్ని చూస్తూ కాదు!

ప్రియంవదను చూచిన క్షణంనుండీ సుశీల మెదడులో ఆలోచన పగ్గాలు బిగించిన పందెపు గుర్రంలా పరుగు తీస్తున్నది. ప్రియంవద నల్లగ్రుడ్లు నిజంగా తుమ్మెదలై సుశీల మెదడును తొలుస్తున్నట్టుగా వుంది. 'ఈమెను ఎక్కడో చూచానబ్బా!' అని మథనపడుతూ గుర్తురాక తన్నుకుంటున్నది సుశీల.

అలాగే కూర్చున్న సుశీల కళ్ళు గిర్రగిరలు వేసినాయి. ముడుచుకుపోయిన ఆమె ముఖం మీద విషపు చారలా నీలిరంగు నరాలు పైకి ఉబికినాయి.

ఎట్టకేలకు గుర్తు రాలేదు సుశీలకు.

## తెల్లగులాబి

ఆ వచ్చిన ఆవిడ. ఆ ఫోటోలోని వ్యక్తి! తన అల్లరిపిల్ల ఆడపడుచు తనకు కాకతాళీయంగా చూపించిన ఫోటోలోని వ్యక్తి! రాజేశ్వరరావు తనను వివాహం చేసుకొనక మునుపు అతను ప్రేమించాడని చెప్పబడ్డ ప్రియంవద!

బుసకొట్టే నాగుబాములా నోట వేడిగాలి వొదులుతూ వరండాలో కూర్చున్న సుశీల చివాలున లేచి గిర్రున వెనక్కు తిరిగింది. పిడుగులు పడినంత శబ్దం వచ్చేట్టుగా తలుపురెక్కలు కొట్టి బిగించి గదిలో మంచంమీద పడుకున్నది.

నొసట చెమటబిందువులు చేరుకుంటూ వుంటే తల నాడు పుడుతూ వున్నది సుశీలకు. అలా ఎంతసేపు పడుకుందో ఆమెకు ఎలా తెలుస్తుంది?

'సుశీ! సుశీ!' అంటూ రాజేశ్వరరావు నాలుగుసార్లు తలుపుకొట్టి పిలిచిన తరువాత ఆమె ఈ లోకంలోకి తిరిగి వచ్చింది. బరువుగా అడుగులు వేస్తూ వచ్చి తలుపు తీసింది.

శూన్యంగా రాజేశ్వరరావు ముఖంలోకి ఒకసారి చూచి వెనక్కు తిరిగింది.

'వొంట్లో బాగుండలేదా, సుశీ!' అంటూ రాజేశ్వరరావు ఆదుర్దాగా పలకరించాడు.

ఆమెకు ఈ మాటలు వినిపించలేదు అన్నట్లుగా మంచంమీద పడుకున్నది.

ఆమె ముఖకవళికలనుబట్టి ఆమెకు ఎందుకో ఆందోళనగా వున్నదని తెలుసుకోవడానికి ఆట్టే టయిం పట్టలేదు రాజేశ్వరరావుకు.

ఆమె మంచందగ్గరకు కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. 'సుశీ! నాకు చెప్పగూడదా. నీ వొంట్లో ఎలావుందో?... నాలుగయిదు రోజుల్లో మీ అమ్మగారు వచ్చేస్తారు. నీవు చెప్పిన సంగతులన్నీ ఉత్తరంలో వ్రాశాను. ఈలోగా నువ్వు స్థిమితంగా వుండాలి. ఊరికే హైరాన పడితే లేనిపోని అనారోగ్యం కొనితెచ్చుకున్నట్టు అవుతుంది.' సుశీల చెక్కిళ్ళు నిమురుతూ అన్నాడు రాజేశ్వరరావు.

సుశీల మోహం చిట్లించిందే తప్ప మారుపలకలేదు.

'చూడు, సుశీ! నీ మోహం ఎలా వాడిపోయిందో? చెమట మరకలు ఎలా వున్నాయో చూసుకో! లే! లేచి ముఖం కడుక్కుని పౌడర్ వేసుకో. ఫ్రెష్‌గా వుంటుంది. నువ్వు ఎప్పుడూ హాయిగా, ఆనందంగా వుండాలని మొన్ననేకదా డాక్టరు చెప్పింది. నువ్వు చికాకు పడితే చాలా ప్రమాదం అని డాక్టరు హెచ్చరించింది కూడాను. ఇంతలోనే మరచిపోయావా?'

'మరచి పోదామనుకున్న సంగతులే మళ్ళీ గుర్తుకు వస్తున్నాయి.' గంభీరంగా మాట్లాడింది సుశీల.

రాజేశ్వరరావు ఆలోచనలో పడ్డాడు. ఆమె మాట్లాడుతున్నది దేనిని గురించో తర్కించి అడుగుదామని అనుకున్నాడు. కాని సుశీల మనస్సును ఇంకా కలతపెట్టినట్టు అవుతుందేమోనని తమాయించుకున్నాడు.

'సరే! అవన్నీ ఇప్పుడెందుకుగాని, నువ్వుమాత్రం ఈ నాలుగురోజులపాటు నేను చెప్పినట్టు వినాలి. ఆ తర్వాత నీ ఇష్టం. మీ అమ్మగారి ఇష్టం. అన్నట్టు, ఇవాల్టినుండి నీకు కావలసినంత సందడి. మన ప్రక్కవాటాలోకి ఎవరో దిగివుంటారు ఇవాళ. ఇంకా పరిచయం కాలేదా?' మాటలు మార్చితే సుశీల మనస్సును మళ్ళించవచ్చుని ఆశగా అన్నాడు రాజేశ్వరరావు.

'ఎవరో చెప్పమంటారా?' భయంకరంగా చూస్తూ ఒ దిలు పలికింది సుశీల.

సుశీల వాలకం చూచి రాజేశ్వరరావు ఆశ్చర్యపడ్డాడు.

అతను చలనం తప్పిపోకుండా ఉండేటానికి అన్నట్టుగా చర్నాకోలుతో చురక వేసినట్టుగా రెండు మాటలు విసిరింది సుశీల. 'మీ ప్రియురాలు!'

రాజేశ్వరరావుకు మెరుపులతో కూడిన మేఘగర్జనలా వినిపించింది ఇంత చిన్న వాక్యం. అతని మనస్సు రాజధానీ ఎక్స్‌ప్రెస్ వేగంతో పరుగెత్తింది...............

పాపం! ప్రియంవద! కాలేజీలో తనతో పాటు నాలుగేళ్ళు చదువుకున్నది. తను స్పోర్ట్సులో గెలిచిన షీల్డు ఆమెకు వచ్చినట్టుగా గర్వపడేది. ఆమె ఫస్టుక్లాసులో ప్యాసైనా తను సెకండుక్లాసులో ప్యాసై

నందుకు ఎక్కువ సంతోషించింది. ఆమె తండ్రి చిన్నతనంలోనే గతించినా వాళ్ళ అమ్మ ఆమెను గారాబంగా పెంచింది. చదువు చెప్పించింది. ప్రియంవద తన మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నది. ఆమె రాగానికి తను శ్రుతి కలిపాడు. ఇద్దరిదీ ఒకేకులం కాబట్టి తను ప్రేమ ఫలిస్తుందని ధైర్యంగా తండ్రితో చెప్పాడు మంచిరోజు చూచి. 'సకల భయివేలు కట్నానికి పిళ్ళు వదిలి చివరకా అడపెత్తనంలో పెరిగిన పోకిరీ పిల్లను కట్టుకుంటావురా, భ్రష్టుడా!' అని అతని తండ్రి హిరణ్యకశిపుడిలా విరుచుకు పడ్డాడు. ఒక అందాల భరిణెను అత్తరులు పాచి ప్రేమించే సాహసంతులు కోకొల్లలు. అందులో ఎంతమందికి తండ్రిని ఎదిరించే ధైర్యం వుంటుంది? అలాంటి అసమర్థులలో తనూ ఒకడు. పాపం! ప్రియంవదకు అన్యాయం జరిగింది ... లేదు. న్యాయమే జరిగిందేమో ! తనలాంటి పిరికిపంద దారి తప్పక మునుపే ఆమె దారినుండి తొలగి పోవడం మంచిదే అయింది. ఆమెలాగానే అందంగా, చాకచక్యంగా, ధైర్యంగా వుండే వాడు ఆమె పూర్వపుణ్యం ఫలించి దొరికి వుంటాడు.

బరువుగా నిట్టూర్పు విడిచాడు రాజేశ్వరరావు.

మరుక్షణం తీక్షణంగా చూచాడు.

అతనికి ఇదివరకు ఎన్నడూ లేని అసహ్యం వేసింది, తనమీద, తనకు ఎదురుగ్గా మంచంమీద పడుకున్న సుశీలమీద.


'మనం మరొకరిని గురించి మాట్లాడేటప్పుడు మానవత్వం పోగొట్టుకోకూడదు. నీ వాలకాన్ని పట్టిచూస్తే నీవు ఎలాంటి అపనిందలు వేయడానికైనా వెనుదీయవేమోనని అనిపిస్తున్నది. అందుకే ఇంత గట్టిగా చెబుతున్నాను. మన ప్రక్కవాటాలో దిగిన పుణ్యమూర్తులను గురించి నీ నోటినుండి వచ్చిన మొదటి వాక్యం ఆఖరి వాక్యం కావాలి. ఇందుకు ఏమాత్రం భిన్నం జరిగినా నేను సహించను. తెలిసిందా?' అంటూ కుర్చీలోనుండి చివాలున లేచాడు రాజేశ్వరరావు.

మెడమీద చెయ్యి ఆనించుకుని తల వూపుకుంటూ అవతల గదిలోకి వెళ్ళాడు రాజేశ్వరరావు.

పడకకుర్చీలో పడుకుని జుట్టులో వ్రేళ్ళు దూర్చుకుని దున్నుకున్నాడు. కుర్చీ ప్రక్కనే స్టూలుమీదవున్న తన అభిమాన వారపత్రిక చేతబుచ్చుకున్నాడు. పేజీలు తిరగవేస్తున్నాడు. కమ్మని కధలు కూడా చదువలేకపోయాడు.

ఎన్ని గుండెలు ఎన్నిరకాలుగా ఎంత వేదన పడుతున్నా గడియారం ఒకేవేగంతో నడుస్తుంది.

తొమ్మిదిగంటలు అయింది.




రాజేశ్వరరావు వాళ్ళ ఇంటికి దగ్గరలో వున్న ఇరానీ హోటలుకు వెళ్ళి బ్రెడ్డు, బట్టరు పట్టుకొచ్చాడు.

ససేమిరా తినను అని సుశీల అలిగినా గదమాయించి రెండుముక్కలు తినిపించాడు. తనూ రెండుముక్కలు నమిలాడు.

కాలుతున్న మనస్సుతో సుశీల మంచం మీద పడుకున్నది. కంటిమీద కునుకు రాలేదు.

క్షోభించుతున్న గుండెలతో రాజేశ్వరరావు పడకకుర్చీలోనే పడివున్నాడు.

భళ్ళున తెల్లవారింది

ప్రకృతి ప్రసాదించిన సూర్యరశ్మితో పాటు విజ్ఞత అందించిన వెలుతురు చూచాడు రాజేశ్వరరావు. 'నిన్న సాయం కాలం తొందరపడ్డానేమో! చికాకు పడుతూన్న సుశీల మనసును మరింత చిలికించానేమో! ఏమో! నిన్న ఉదయం ఆఫీసుకు వెళ్ళేంతవరకూ తమకు పుట్టబోయే బంగారుపాపను తలచుకుంటూ ఎంతో ఆనందంగా గడుపుతూవుంటే ఇంతలో ఈవిషమ పరిస్థితి వచ్చిపడ్డది' అని పరితపించాడు రాజేశ్వరరావు.

సుశీల మాత్రం కొంచెంసేపు శూన్యంగాను, మరికొంతసేపు కనుబొమ్మలు ముడుచుకుంటూ గోడలవంక చూస్తూ మంచంలో పడుకున్నది కనురెప్పలు మూస్తూ, తెరుస్తూవుంటే బరకగా, మండుతూన్నట్టు వున్నది. నోట వెచ్చని గాలి నిన్నటినుండీ వస్తూనే వున్నది. ముక్కులు మండుతున్నాయి. కణతలు కొట్టుకుంటున్నాయి. నోరు చేదెక్కింది. కాఫీకూడా రుచించలేదు.

రాజేశ్వరరావు తనకు చేతనైనట్టు వంట చేశాడు. తనతోపాటు సుశీలనుకూడ భోజనం చేయమని బతిమిలాడాడు.

సుశీల భీష్మించుకుని పడుకున్నది. తనకు రవ్వంత అయినా ఆకలిలేదు అన్నది. పైగా వాంతి వచ్చేట్టుగా వుందని చెప్పింది. కొంతసేపటికి నిజంగానే వాంతి చేసుకున్నది

రాజేశ్వరరావు ఇవాళ ఆఫీసు శలవు పెడదామని అనుకున్నాడు. కాని అలా అనుకుంటూ వుండగానే గుర్తుకొచ్చింది ఇవాళ వాళ్ళ ఆఫీసరు ట్రాన్స్ఫరు అయి వెళుతున్నాడు. పాత ఆఫీసరుకు

పీకోక్స్‌లు, క్రొత్త ఆఫీసరుకు స్వాగతం చెప్పడానికి ఉద్యోగులు అందరూ కలసి పార్టీ ఇస్తున్నారు. ఆలస్యం చేస్తే బాగుండదు అనుకుంటూ ఆఫీసుకు బయల్దేరాడు.

వెళ్ళబోయే ముందు సుశీల మంచం దగ్గరకు వచ్చి 'సుశీ! ఇప్పుడు నేను ఏమి చెప్పినా నీ మనసు కుదుట పడకపోవచ్చు. కాని ఒక్కమాట మాత్రం నిజం. నేను నీకుగాని, మరెవ్వరికి గాని అన్యాయం చేయ లేదు, చేయను... ఆఫీసుకు వెళ్ళగానే మీ వూరికి టెలిగ్రాం ఇస్తాను. బహుశా రేపు గాని టెలిగ్రాం చేరదేమో. మీ వూరికీ టెలిగ్రాఫు ఆఫీసు చాలా దూరం గదా! రేపు రాత్రికి బస్సులో బయల్దేరి ఎల్లుండి తెల్లవారే సరికి మీ అమ్మగారు వస్తారు. అందాకా నీవు ప్రశాంతంగా వుంటే ఆ ఆ తర్వాత అన్నీ చక్కబడతాయి,' అని చెప్పి మరీ వెళ్ళాడు.

రాజేశ్వరరావు ఆఫీసుకు వెళ్ళిన తరువాత సుశీల లేచి తలుపులైనా మూయ లేదు వోపిక లేదేమో!

పావుగంట గడిచేసరికి వరండాలో మధుర మైన పిలుపు వినవచ్చింది, 'ఏమండీ! పడుకున్నారా?' అని.

సుశీల తూలుతూ వెళ్ళింది వాకిలి దగ్గరకు.

ప్రక్క నాటారో దిగిన ప్రియంవద వరండాలో నిలబడి వున్నది, ఆమె చేతిలో తెల్లగులాబి పువ్వు పుచ్చుకుని వుంది.

సుశీలను చూడటంతోటే ప్రియంవద ముందుకు అడుగు వేసింది. 'అయ్యో! తూలిపోతున్నారే, ఒంట్లో బాగా లేదా?' అంటూ ప్రియంవద సుశీల నడుము చుట్టూ చెయ్యి పోనిచ్చి పట్టుకుని తీసు కొచ్చి మంచం మీద పడుకోబెట్టింది. మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చున్నది.

సుశీల ఏమీ మాట్లాడలేదు.

ప్రియంవదకు కొంచెం వింతగాను, చిన్నతనంగాను అనిపించింది. అయితే సుశీలను నఖశిఖ పర్యంతం చూచిన తరువాత ప్రియంవద ముఖంలో చిరునవ్వు చిందులు త్రొక్కింది.

'అదా, విశేషం! మీరు ఇంత నీరసంగా వుంటే ఎందుకో, ఏమిటో నాకు పాలు పోలేదు. ఇప్పుడు తెలిసింది. మీరు ఎంత


లుంగీలుకును
జెబురుమాళ్లకును

PALAYAKAT CO. PVT. LTD. MADRAS · MADRAS
REGD. TRADE MARK
80s x 80s

మాయొక్క
శంఖు
మార్కు

మదరాసు పాలయకాట్ కంపెని
ప్రైవేట్ లిమిటెడ్
31, ఆర్మీనియన్ స్ట్రీట్, మద్రాసు-1



FOSADL 1274TE

దురదని తరమండి!

# అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్

ఎక్సిమా • తామర • గజ్జి
వీటిని సురక్షితంగా, శీఘ్రంగా, చక్కగా పోగొడుతుంది.
ఇది అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపే అని గుర్తు ఉంచుకోండి.



అదృష్టవంతులండీ!' అంటూ ప్రియంవద సుశీల చెక్కిళ్ళు నిమిరింది. బలవంతాన లేవదీసి కూర్చోబెట్టి తాను తెచ్చిన—తెల్ల గులాబీపువ్వును సుశీల జడలో ముడిచింది.

సుశీల ఇంకా మౌనంగాను, దిగులుగాను వుండటం చూచి ప్రియంవద మరింత జాలిపడ్డది.

'మీకు వోపిక లేకపోయినా తెచ్చిపెట్టుకోవాలి. సర్దాగా మాట్లాడుత్తూవుంటే బాగుంటుంది. మీ అల్లిక సూదులు, వూలు వుంటే పట్టుకురాండి. మీ బంగారు బాబుకు స్వెట్టరు అల్లుదురుగాని, నేను ఒక మంచి డిజైనువేసి చూపిస్తాను' అన్నది ప్రియంవద.

'ఎందుకండీ, నన్ను అంత ఎగతాళి చేస్తున్నారు. నేను పుట్టి పల్లెటూరు గొడ్డును. మాఅమ్మ నాకు కుట్లు, అల్లికలు నేర్పలేదు. నేను మీలాగా కులాసాగా, చలాకీగా వుండటానికి నోచుకోలేదు.' యాష్టపడుతూ మాట్లాడింది సుశీల.

'అదేమిటండీ, అలా అంటారు? నాకంటె మీరే ఎంతో అందంగావున్నారు. అల్లిక నేర్చుకోవడం ఎంత భాగ్యం! మీరు ఇప్పుడు మొదలుపెడితే మీబాబు పుట్టేసరికి స్వెట్టరు, టోపీ, మేజోళ్ళు ఎన్నో అల్లుకోవచ్చు?'

# తెల్ల గులాబి

నిండు మనస్సుతో ప్రియంవద పలికిన మాటలకు బదులుగా బరువు గుండెలతో యాష్టపడటం తప్ప మనసిచ్చి మాట్లాడలేదు సుశీల.

ప్రియంవద చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది.

సుశీల గదిలోనుండి మూలుగు వినిస్తోంది. ప్రక్కవాటాలోవున్న ప్రియంవదకి శేఖరంలకు స్పష్టంగా వినిపిస్తున్నది.

మూలుగు వినిపిస్తున్నా మళ్ళా చొరవ తీసుకుని సుశీలదగ్గరకు వెళ్లడానికి మనస్కరించలేదు ప్రియంవదకు.

కాని శేఖరం వుండబట్టలేక ప్రియంవదతో, 'చూడు ప్రియంవదా! మనప్రక్కవాటాలో మూలుగు వినిపిస్తున్నది నువ్వు ఇంతకుముందే వెళ్ళిచూచి వచ్చావుగదా, ఆమెకు వొంట్లో బాగాలేదా? ఇంట్లో ఎవరన్నా వున్నారా మరి?' అన్నాడు.

'అవును. నేను ఇందాక చూచివచ్చినప్పుడు ఆమె ఒక్కతే వుంది. పైగా ఆమె వట్టిమనిషికాదు.'



ఖైదీలు మారు వేషాలతో పారిపోవ ప్రయత్నిస్తున్నారు'—వార్త.

'మరైతే అలా చూస్తూ వూరుకుంటే ఎలా? పద, నేనూ వస్తాను.' అంటూ శేఖరం ముందు బయల్దేరాడు.

ప్రియంవద, శేఖరంలు సుశీల గదిలోకి వచ్చేసరికి ఆమె మంచం మీద పడుకుని తపన పడుతున్నది. పడుకోలేకుండా, కూర్చోలేకుండా వున్నది.

'నువ్వు ఆమెను చూస్తూ వుండు. నేను వెళ్ళి డాక్టరును పిలుచుకొస్తాను' అన్నాడు శేఖరం.

'ఉండండి. ఆమె పరిస్థితి చూస్తూ వుంటే డాక్టరు ఇక్కడకు వచ్చి చేయగలిగింది ఏమీ వుండదేమో అనిపిస్తున్నది. మీరు రోడ్డు మీదకు వెళ్ళి అక్కడ ఇరానీ హోటలునుండి నిలోఫర్ హాస్పిటల్‌కు ఫోను చేయండి వాళ్ళు అంబులెన్సు పంపుతారు' అని చెప్పి శేఖరాన్ని పంపింది ప్రియంవద.

పావుగంట క్రితం పలకరించితే ఏవగించుకున్న సుశీల ఇప్పుడు ప్రియంవదను చూడగానే ముఖం నల్లకప్పు వేసుకుపోయింది. సుశీల కళ్ళల్లో నీళ్లు తిరిగినాయి.

'నాకు ఏమీ తెలియడంలేదు భగవంతుడా! నాకు ఈ అవస్థ ఎందుకు తెచ్చిపెట్టావ్' అంటూ కన్నీరు కార్చింది సుశీల.

'గాభరా పడకండి. మీవాళ్లు ఎవరూ లేరని మీరు దిగులు పడకండి. ఇరుగు పొరుగు మేము వున్నాం.' అంటూ సుశీలను తన వడిలోకి తీసుకుంది ప్రియంవద. గుండెలకు హత్తుకున్నది. తల నిమిరింది.

'అన్నట్టు మీ వారి పేరు, ఆఫీసు చెప్పండి. శేఖరం చేత టెలిఫోను చేయించి పిలిపిద్దాం' అని అడిగింది ప్రియంవద.

సుశీల సమాధానం చెప్పింది.

ప్రియంవద ఏది తొణకలేదు, బెణకలేదు.

శేఖరం తిరిగి రాగానే అతనికి చెప్పింది ఆఫీసుకి ఫోను చెయ్యమని.

మరి అయిదు నిముషాల్లో అంబ్యులెన్సు వ్యాను వచ్చి వాకిలి ముందు హారను మ్రోగించింది.

నీలోఫర్ హాస్పిటల్ చేరుకోగానే సుశీలను డాక్టరు పరీక్షచేసి సరాసరి లేబరురూముకు పంపించింది.

టెలిఫోనువార్త అందుకున్న రాజేశ్వరరావు ఆఫీసునుండి హడావుడిగా నీలోఫర్ హాస్పిటల్‌కు వచ్చాడు. ఎంక్వయిరీలో కనుక్కున్నాడు. అతను చెయ్యగలిగిందల్లా వెయిటింగ్ హాలులో కూర్చోవటమే!

లోపల లేబరు రూములో డాక్టరు వచ్చి సుశీలను మళ్ళీ పరీక్షచేసింది. 'షి సెంట్‌బి ఏబుల్‌టు కీప్' అని ప్రక్కనున్న ప్రియంవదతో చెప్పింది. సిస్టరును పిలిచి ఇన్స్ట్రుమెంట్సు సిద్ధం చేయమని చెప్పింది డాక్టరు.

ఒకగంటలో సుశీల నిన్నటి ఉదయం వరకూ కలలు కనిన బంగారుపాప రూపం లేని ముక్కలై బక్కెట్టులో పడ్డది.

తరువాత సుశీలను వార్డులోకి పంపింది డాక్టరు.

సుశీల స్పృహతప్పి పడుకున్నది. ప్రియంవద సుశీలను కనిపెట్టుకుని వార్డులోనే వుండిపోయింది.

వార్డు క్రిక్కిరిసి వుంది. కొంతమంది పేషంటులను నేలమీదనే పరుపులువేసి పడుకోబెట్టారు. 'మేం జాగ్రత్తగానే చూచుకుంటాం. మీరు ఇంటికి వెళ్లవచ్చు' అని సిస్టరు చెప్పినప్పటికీ ప్రియంవద ఆ రాత్రి వార్డులోనే సుశీలను కనిపెట్టుకుని వుంది.

తెల్లవారింది.

దూరంగా చెట్లమీద పక్షుల కిలకిలారవం వింటూ, ఎదురుగా కిటికీ అద్దాల గుండా చొచ్చుకొస్తున్న వెలుతురును చూస్తూ లేచి కూర్చున్నది సుశీల.

అప్పటికి అయిదునిముషాల ముందు ప్రియంవద ముఖం కడుక్కోవడానికి బాత్‌రూముకు వెళ్లింది.

స్వచ్ఛమైన సుశీల కళ్లు ప్రియంవద కోసం నలుమూలలా వెతుకుతున్నాయి. అలా వెతుకుతూ ఆమెదృష్టి బాత్‌రూము వైపుకు మరలింది. బాత్‌రూమునుండి బయటకు వస్తున్న వ్యక్తిని చూచింది. ఆ వ్యక్తిముఖం విప్పారిన తెల్లగులాబీలా కనిపించింది సుశీలకు. ●

# ధీమంతులు—మూర్ఖులు



బులుసు వెంకటరమణయ్య—ధర్మపథం

✱ చిన్నయసూరి నీతిచంద్రికలో స్నేహం విలువను వివరిస్తూ 'సంసార విషవృక్షమునకు అమృతతుల్యములగు ఫలములు రెండు; కావ్యామృత రసపానమొకటి; సజ్జనసంగతి యొకటి' అని చెప్పివున్న సంగతి అందరికిన్నీ తెలుసు. అయితే—యీ విషయాన్ని అందరూ గ్రహించలేరు. బుద్ధిమంతులైన వారే దీన్ని గ్రహించి ఆయనలో ఏకీభవిస్తారు.

ప్రతివారికీ జన్మించిన తర్వాత కొంత కాలం జీవించి వుండడం తర్వాత మరణించడం సహజం. జీవనప్రమాణంలో మాత్రం తేడా వుంటుంది. కొందరు కొద్దికాలమే జీవించవచ్చు. కొందరు నడిమి వయస్సులో మరణించవచ్చును. కొందరు నూరేండ్లదాకా బ్రతికియుండవచ్చును బ్రతికి ఉన్నన్నాళ్లూ ఊరికే ఉండడం ఎవ్వరికీ సాధ్యంకాదు. ఏదోవిధంగా కాలాన్ని గడపవలసి ఉన్నది.

అలా కాలాన్ని గడపడంలో రెండు విధాలు కానవస్తున్నవి. బుద్ధిమంతులు అనుసరించే పద్ధతి ఒకటి; మూర్ఖులు అవలంబించే మార్గం ఒకటిన్ని. ధీమంతులు తమ తీరిక సమయంలో సద్గ్రంథాలను చదివిగాని, ఇతరులవల్ల వినిగాని ఆనందిస్తూ కాలం గడుపుతారు.

మూర్ఖులకు ఇది రుచించదు. ఏ జూదం ఆడడమో, లేకపోతే ఏదో నెపం పెట్టుకుని యితరులతో జగడమాడడమో చేస్తారు. లేదా సోమరిపోతువలె నిద్రపోతారు. ఈవిధంగా వాళ్లకి కాలం గడుస్తుంది.

ఈ విషయాన్నే నీతివేత్తలయిన పెద్దలిలా చెప్పారు.

'కావ్యాలాప సుఖేనైవ
కాలో గచ్ఛతి ధీమతాం
వ్యసనేన చ మూర్ఖాణాం
నిద్రయా కలహేన చ.'

'బుద్ధిమంతులైన వారికి కావ్యాలాపన వల్ల కలిగే ఆనందంతోనే కాలం గడుస్తుంది. మూర్ఖులకు వ్యసనంచేతగాని, నిద్రపోవడంవల్లగాని, కలహంవల్లగాని కాలం గడిచిపోతుంది' అని దీని అర్థం.

ఇక్కడ 'కావ్యం' అంటే కేవలం కావ్యాన్ని మాత్రమే గ్రహించకూడదు. గ్రంథాన్నే గ్రహించాలి. అందులోనూ సద్గ్రంథాన్నే గ్రహించాలి. అది పురాణం కావచ్చు, ఉపనిషత్తు కావచ్చు, ఇతిహాసం కావచ్చు, కావ్యం కూడా కావచ్చు. ఏ గ్రంథాన్ని తీసుకున్నా, అది ఉపయోగకరమైనదిగా ఉండాలి. ఏవిధంగానైనా కొంత జ్ఞానాన్ని ఇచ్చేదిగా ఉండాలి. ●